క్లుప్తంగా

వీరభద్రస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ప్రముఖులు

మేడిపెల్లి: మండలంలోని కల్వకోట గ్రామంలో శనివారం వీరభద్ర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలుచేసి అన్నదానం నిర్వహించారు. బీజేపీ నాయకురాలు తులఉమ, జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్ రావు, సర్పంచ్‌లు హనుమక్క, సంపత్, వెంకటేశం, సురేశ్, రాజగౌడ్, మారుతి, భక్తులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్థానికులు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి శివారు గ్రామమైన పుల్లయ్యపల్లిలో ఇటీవల ఇళ్లు దగ్ధమై ఆర్థికంగా నష్టపోయిన బాధితురాలికి స్థానికులు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన అడుప అనసూర్య నివసిస్తున్న ఇల్లు ఈనెల 4న షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. పుల్లయ్యపల్లి, కొండయ్యపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, యువకులు బాధితురాలికి ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు రెండు గ్రామాల్లో కలిసి విరాళంగా సేకరించిన రూ.80వేలను శనివారం అనసూర్యకు అందించి ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధితురాలికి గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇంటిని నిర్మించి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నంది విగ్రహానికి రేకుల షెడ్డు ఏర్పాటు



నంది విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన రేకుల షెడ్డు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన భూపతి గంగారాం అనేవ్యక్తి మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో నందివిగ్రహం వద్ద శనివారం రేకుల షెడ్డు ఏర్పాటుచేయించారు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా పేరున్న పెద్దాపూర్ మల్లన్నస్వామి సమీపంలోని నందివిగ్రహం వద్ద సొంతఖర్చులతో రేకుల షెడ్డు ఏర్పాటు చేయించడం ఆనందంగా ఉందని గంగారాం తెలిపాడు.

పోస్టర్ ఆవిష్కరణ



మల్యాల: మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం బీఎస్పీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవీందర్ మాలల రాజకీయ చైతన్య సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఈ నెల 13న నిర్వహించే మాలల రాజకీయ చైతన్య సదస్సుకు బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతున్నారని వేలాదిగా తరలివచ్చి,సదస్సును విజయవంతం చేయాలని రవీందర్ పిలుపునిచ్చారు. తాళ్ల తిరుపతి, మనుగూరి నివాస్, చెలుమల్ల భూమేశ్, అదనాలరాం, మల్యాల సుమంత్, వేల్పుల భూమయ్య, బొల్లె వంశీ, కట్టనవీన్ పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారణకు చర్యలు

బుగ్గారం: గ్రామాల్లో స్వైరవిహారం చేస్తూ గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న వీధికుక్కలను ని వారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బుగ్గా రం ఎంపీడీవో తిరుపతి అన్నారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీచేశారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని, వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. పట్టుబడిన కుక్కలకు స్టెరిలైజేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిన్నపిల్లలను ఒంటరిగా వీధుల్లోకి పంపించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ఎంపీవో అఫ్జల్‌మియా, సూపరింటెండెంట్ రాణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సండే స్పెషల్

పదాలు కూర్చి.. పల్లెలను కదిలించి..

కోరుట్లటౌన్: పల్లెను కదిలిస్తే పదం పాడుతుంది. పిల్ల కాలువను కదిలిస్తే నాట్యమాడుతుంది. అన్నట్లుగా పల్లె వాతావరణంలో పెరిగిన రావికంటి పవన్‌కుమార్ తనదైన ముద్ర వేసుకునేందుకు తెలుగు సాహితీరంగం పునాదిగా మారింది. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిచేపట్టారు. 80 తెలుగు కవి సమ్మేళనాలు, ప్రభుత్వ ఎస్‌సీఈఆర్‌టీ, టీశాట్ ఛానల్‌లో 35 పాఠ్యాంశాల ప్రసారాలు, 400 సార్లు వ్యాఖ్యాతగా, వివిధ పత్రికల్లో కాలమిస్టుగా, విశ్లేషకులుగా, పాఠశాల అభివృద్ధిలో సామాజిక సేవా దృక్పథంతో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 2005లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2019లో తెలుగు సాహిత్యంలో జాతీయ పురస్కారంతోపాటు పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం విభాగంలో బెస్ట్ హెడ్మాస్టర్‌గా స్వామి వివేకానంద సొసైటీ హైదరాబాద్ పురస్కారం అందుకున్నారు.



సాహితీ పురస్కారం అందుకుంటున్న రావికంటి పవన్‌కుమార్

బాల్యం-చదువు

- వేములవాడ రాజన్న జిల్లా కేంద్రంలోని రుద్రంగి గ్రామంలో ప్రాథమిక, హైస్కూల్ విద్య పూర్తిచేశారు. కోరుట్లలో ఇంటర్, జగిత్యాలలో డిగ్రీ పూర్తిచేసి, హైదరాబాద్‌లో పీజీ, ఉన్నత చదువులు చదివారు. 1996లో కోనరావుపేట మండలం గోవిందరావుపల్లెలో ఎస్జీటీగా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. 2013లో హెడ్మాష్టర్‌గా పదోన్నతి పొంది కోరుట్ల మండలం సర్వరాజ్‌పల్లెలో పనిచేశారు. 2012లో కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్‌లో నివాసం ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు.



ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి..

- పాఠశాలలో ప్రజలను భాగస్వామ్యం చేసి, అనేక సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి సేవా క్లబ్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులు ఇప్పించారు. కనీస వసతుల కల్పనలో దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేశారు. ఎక్కడ పనిచేసినా పాఠశాల అభివృద్ధి పరచడంలో ఆదర్శంగా నిలిచారు. 2019లో కథలాపూర్ మండలంలో రిసోర్స్‌పర్సన్‌గా పనిచేసి, ఉన్నతాధికారుల మెప్పు పొందారు.

సాహిత్యంలో మొదటి అడుగులు..

- పాఠశాల స్థాయి 8వ తరగతిలో తెలుగు సాహిత్యంలో మొదటి అడుగులు పడ్డాయి. గురువులు ఆలూరి కిషన్‌రావు, రేగులపాటి కిషన్‌రావు, రఘురామయ్య మాస్టార్ ప్రభావంతో ఇంగ్లిష్ స్టోరీని తెలుగులో నాటిక రూపంలో రాసి, అభినయం చేసి బహుమతులు పొందారు. వందల్లో కవి సమ్మేళనాలు, నాలుగు వందల వేదికలపై వ్యాఖ్యానాలు చేసి ఎంతో అనుభం సాధించారు. అక్షర దళాలు పేరిట శతక పద్యాలతో కూడిన పుస్తకం రాసి, సాహిత్య రచనలకు శ్రీకారం చుట్టారు. మరో నాలుగు పుస్తాకాలు రాసి నప్పటికీ అముద్రితాలుగా ఉన్నాయి. ప్రస్తుతం వాటి ఆవిష్కరణకు కృషిచేస్తున్నారు.

టీ-శాట్ ఛానల్‌లో ప్రసారాలు



ఎస్‌సీఈఆర్‌టీ వర్క్‌షాప్‌లో పాఠ్యాంశాల కూర్పునకు జీవ శాస్త్ర నిపుణులుగా రావికంటి పవన్‌కుమార్ విశేష సేవలు అందించి, ప్రతిభావంతుడిగా గుర్తింపుపొందారు. డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా టీ-శాట్ ఛానల్‌లో ప్రాథమిక తరగతుల నుంచి పదో వతరగతి వరకు జీవశాస్త్రంపై 35 పాఠ్యాంశాలు రూపొందించి రికార్డుచేసి, ప్రసారం చేయడంతో మంచి పేరు సంపాదించుకున్నారు.

- గ్రామీణ జనజీవనంలో 'రావికంటి'
- సాహిత్య సేవలో అగ్రగామి
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, బెస్ట్ హెడ్‌మాస్టర్ అవార్డు గ్రహీత
- టీ-శాట్ ఛానల్‌లో బోధకుడిగా గుర్తింపు

పుస్తక రచనలు

- ప్రతీ యుగానికి బాట పవను మాట మకుటంతో శతక పద్య సమాహారం 'అక్షర దళాలు' మొదటి పుస్తకం 1995లో హైదరాబాద్ ఆర్యవైశ్య హాస్టల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.
- గాజు పలకలు, 3) వేకువై... పొడవనీ, 4) నీలో నేను, 5) ఎలిగెత్తిన శిశిరం పుస్తకాలు అముద్రితాలు

అవార్డులు, పురస్కారాలు

- ఉపాధ్యాయ వృత్తి సేవలకు కరీంనగర్ జెడ్పీలో మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-1995
- నల్గొండ పుడమి సాహితి వేదికపై రాష్ట్ర సాహితీ పురస్కారం -2012
- వివేకానంద సొసైటీ హైదరాబాద్‌లో బెస్ట్ హెడ్మాష్టర్ అవార్డు-2019
- రావికంటి పవన్ కుమార్ కవి సమ్మేళనాలలో సన్మానం, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

లక్ష్యం



- నిత్య విద్యార్థిగా, బోధకునిగా, చైతన్యశీలిగా ఉంటూ ప్రతీక్షణం విద్యార్థులకు బాసటగా నిలుస్తాను. సాహితీ రంగంలో రచించిన నాలుగు అముద్రిత పుస్తకాలను గ్రంథరూపం చేస్తాను. సామాజిక సేవలు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ నావంతు పాత్ర, బాధ్యత నిర్వహిస్తాను.

– రావికంటి పవన్ కుమార్, కోరుట్ల

కరీంనగర్ ఎంపీ దిష్టిబొమ్మ దహనం



రాయికల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/మెట్‌పల్లి/రాయికల్/మల్లాపూర్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్/మేడిపెల్లి/కొడిమ్యాల/మల్యాల/మేడిపెల్లి: ఎమ్మెల్సీ కవితపై ఎంపీ బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్ దిష్టిబొమ్మను శనివారం ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ప్రాంతాల్లో దహనం చేశారు. సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదుచేశారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర విజయవంతం

జగిత్యాలటౌన్: హాథ్‌సేహాథ్ జోడోయాత్ర విజయవంతానికి కృషిచేసిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, నియోజకవర్గ ప్రజలకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుతో పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. 2018లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలతో పాటు కాంగ్రెస్ పాలనలో అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, బల్దియా కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దుర్గయ్య, సీనియర్ నాయకులు గాజుల రాజేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు, లైశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' కార్యక్రమం చాలా గొప్పది



సన్మానిస్తున్న అల్లీపూర్ పాలకవర్గ సభ్యులు

వెల్గటూర్: కంటివెలుగు చాలా గొప్ప కార్యక్రమమని ఎండపల్లి సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి అన్నారు. ఎండపల్లి మండలకేంద్రంలో ఫిబ్రవరి 16 నుంచి మార్చి 11 వరకు నిర్వహించిన 'కంటివెలుగు' వైద్యశిబిరం ముగింపు కార్యక్రమానికి సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి హాజరై 25 రోజులుగా ప్రజలకు సేవలు అందించినందుకు గాను అంబారిపేట పీహెచ్‌సీ డాక్టర్ లవన్‌కుమార్, క్యాంపు ఇన్‌చార్జి రమణవల్లి, డా.స్వప్న, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, జీపీ సిబ్బందికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మైలారపు సతీశ్, బీఆర్ఎస్ నాయకులు మారేపల్లి రవీందర్‌రెడ్డి, రైతు అనుబంధ సంఘం మండల అధ్యక్షుడు మారం జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మస్కూరి మల్లేశం జీపీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సిబ్బందికి సన్మానం

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో 19 రోజులు నిర్వహించిన కంటివెలుగు వైద్యశిబిరంలో విధులు నిర్వహించిన వైద్యులు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలను శనివారం జీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఉపసర్పంచ్ సాగర్‌రావు, డాక్టర్ నరేంద్ర, హెచ్‌ఈవో శ్రీనివాస్, అప్తోమెట్రిస్ట్ సునీత, డీఈవో ఉమ పాల్గొన్నారు.



డాక్టర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ జలంధర్‌రెడ్డి

పెగ్గెర్లలో 1,150 మందికి కంటి పరీక్షలు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో 10 రోజులు 'కంటివెలుగు' వైద్యశిబిరం నిర్వహించి 1,150 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి సింధూజ శనివారం తెలిపారు. 140 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. కంటివెలుగు కార్యక్రమానికి సహకరించిన వైద్యాధికారిని, వైద్యసిబ్బందిని గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, శ్రీలక్ష్మి, శ్రీధర్, భూషణ్, ఏఎన్ఎం శిరీషా, కారోబార్ మహేందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కథలాపూర్: ముదిరాజ్ కులస్తులు ఉన్నత చదువులు చదివి లక్ష్యాలను చేరుకోవాలని ఆధ్య గోలి ఫౌండేషన్ చైర్మన్, వేములవాడ నియోజకవర్గ టీఆర్ఎస్ నేత గోలిమోహన్ అన్నారు. శనివారం కథలాపూర్‌లో నిర్వహించిన మండల ముదిరాజ్ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని ముదిరాజ్ యువకులు నిరుద్యోగులున్నారని, ఉన్నత చదువులు చదివిన వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మోహన్‌ను ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. సంఘం ప్రతినిధులు నరేందర్, నర్సయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వైకుంఠరథంను అందిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్

మల్లాపూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్ మండలంలోని స్వగ్రామమైన రాఘవపేటకు ఎమ్మెల్యే తల్లిదండ్రులు కీ.శే. కల్వకుంట్ల సత్తెమ్మ-పాపారావు జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్ నత్తి లావణ్య, ఉపసర్పంచ్ ఎండీ.అమినోద్దిన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ద్యాగ రాజేందర్, నాయకులు గంధం రమేశ్, ద్యాగ లక్ష్మణ్, మదాం నారాయణ, గంగాధరి లింగన్న, చాకలి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌గా మారిన తర్వాత బీజేపీలో భయం



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత బీజేపీలో భయం పట్టుకుందని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని జెడ్పీ క్యాంప్ ఆఫీస్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ.. బీజేపీలో కాకుండా ఇతర పార్టీల్లో ఉండే నాయకులపై ఈడీ, సీబీఐ అంటూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆదాని అవినీతిని డైవర్ట్ చేసేందుకే మోదీ ప్రభుత్వం కవితపై అనవసరపు కేసులు మోపారన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో చేసిన ఆందోళన విజయవంతంతోనే ఆమెను రకరకాలుగా వేధిస్తున్నారని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా దేశం పరువును తీస్తున్నారని, అందుకే మోదీ హఠావో, దేశ్‌కీ బచావో అనే నినాదాన్ని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్‌కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



ఎండుతున్న పొలాలు

సారంగాపూర్: భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయి. ఎప్పుడూ లేనంతగా ఈ యాసంగిలో వరిసాగైంది. దీంతో బావులపై ఆధారపడి వ్యవసాయం చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. బావుల్లో నీరు పూర్తిగా అడుగంటి పోవడంతో వరిపంటలు చిరుపొట్ట దశలో ఎండిపోతున్నాయి. ప్రస్తుతం నీరు ఊహించని విధంగా బావుల్లో అడుగంటి పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పవర్‌కట్

రాయికల్: మండలం వీరాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హరీశ్ తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు



శేషప్ప కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శనలు

ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్యప్రదర్శనలు భక్తులను అలరింపజేశాయి. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని శేషప్ప కళావేదికపై కరీంనగర్‌కు చెందిన కళాబృందం వారిచే నిర్వహించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఆలయం ఆధ్వర్యంలో స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి అభినందించారు.

ఎంపీ బండి సంజయ్ విమర్శలు సిగ్గుచేటు



శుష్మరెడ్డి

రాయికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని లండన్‌లోని టాక్ ఉపాధ్యక్షురాలు శుష్మరెడ్డి మండిపడ్డారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలంటే హుందాగా ఉండి విమర్శలు చేయాలే గానీ ఇలా మహిళలను కించపరిచేలా విమర్శలు చేయడం సరికాదన్నారు. వెంటనే కవితకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిక



ఎంపీతో యువకులు

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు యువకులు శనివారం హైదరాబాద్‌లో ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీలో చేరిన వారిలో మర్రి నందకిషోర్, గంగుల నందు, బండెల వినోద్, బుర్ర హరీశ్, అరిగెల వినీత్, కాశిపాక సురేష్, మార్గం శ్రీకాంత్, చందు, శ్రీనివాస్, నవీన్, విజయ్ తదితరులున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెగడపల్లి: మంత్రి కొప్పుల ఈశ్వర్ అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకుని హైదరాబాద్ వచ్చిన సందర్భంగా పెగడపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు వోరుగంటి రమణారావు, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నందగిరివిండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ఎంపీపీ గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రావు, మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తిరుపతియాదవ్, లోకేశ్‌యాదవ్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్గటూర్: కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించలేని పేదలకు వరంలా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఎండపల్లి మండలం ముంజంపల్లికి చెందిన పోచయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతుండగా మంజూరైన 1.25 లక్షల ఎల్‌వోసీ చెక్కును హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందించారు.

13న మైనార్టీ లబ్ధిదారుల ఎంపిక

రాయికల్: రాయికల్ మున్సిపల్‌లో మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13న ఉదయం 11 గంటలకు పట్టణ వైశ్య సంఘం భవనంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.